క్లుప్తంగా

వెంకన్న విశేష అలంకరణ


విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నరసాపురం: పట్టణంలోని పాల బజార్‌లో ఉన్న శ్రీ వరాల వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో స్వామివారికి విశేష అలంకరణ చేశారు. పూలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పొన్నపల్లిలో తాటాకిల్లు దగ్ధం

నరసాపురం: పట్టణంలోని 2వ వార్డు పొన్నపల్లిలో శనివారం బస్వాని రాంబాబుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైనట్టు భావిస్తున్నారు. అయితే దీపావళి టపాసుల వల్ల ప్రమాదం సంభవించినట్టు భావిస్తున్నారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే అగ్నిమాపక శాఖ వారు వచ్చి మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఇంట్లో రాంబాబు అతని సోదరులు మొత్తం నాలుగు కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. రూ.2.50 లక్షలు ఆస్తినష్టం సంభవించింది. తహసీల్దార్ ఎండీ ఫాజిల్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితులకు 25 కిలోల చొప్పున బియ్యం అందించారు.

గ్రామాల్లో దీపావళి సందడి

పెనుగొండ: దీపావళికి బాణసంచా దుకాణాలు గ్రామాల్లో భారీగా వెలిశాయి. అయితే టపాసుల అమ్మకాలు మాత్రం ఇంకా ఊపందుకోలేదు. శనివారం ఉదయం నుంచి అమ్మకాలు నెమ్మదిగా సాగాయి. పోటాపోటీగా దుకాణాలు ఏర్పాటు చేసి కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు ధరలు సైతం విపరీతంగా పెరగడంతో కొనుగోలు చేయడానికి ప్రజలు వెనకాడుతున్నారు. ఆదివారం అమ్మకాలు ఊపందుకోవచ్చునని ఆశతో దుకాణదారులు ఉన్నారు. మండలంలో పెనుగొండలో 14, సిద్ధాంతంలో ఏడు, వడలిలో ఒకటి బాణసంచా దుకాణాలకు లైసెన్స్ మంజూరు చేశారు.

ఆర్డీఓను కలిసిన గుడాల గోపి


ఆర్డీవో డా.ఎం అచ్యుతాంబరీస్‌ని కలిసి అభినందిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.అచ్యుతాంబరీస్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శనివారం ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా సహకరించాలని కోరారు. ఆయన వెంట చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, గాది ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

క్షీరారామలింగేశ్వరుని ఆలయంలో రుద్రహోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రుద్రహోమం నిర్వహించారు. అలాగే శనివారం శనిత్రయోదశి కావడంతో భక్తులు శనీశ్వరునికి తైలాభిషేకాలు చేశారు. ఆలయంలో కార్తీకమాసం శోభ రెండు రోజులు ముందుగానే కనిపించింది. ఆదివారం దీపావళి, సోమవారం సహజంగా ఆలయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. మంగళవారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కానుండడంతో భక్తులు రెండు రోజులు ముందు నుంచే కార్తీకమాసం ప్రారంభమైనట్లు అయ్యింది. రుద్రహోమం అనంతరం హోమంలో పాల్గొన్న దంపతులకు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణలు స్వామివారి శేషవస్త్రం, జాకెట్ ముక్కలు, ప్రసాదం పంపిణీ చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆకివీడు: స్థానిక శాఖా గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతాయని గ్రంథ పాలకురాలు పార్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే వకృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు. 14వ తేదీన చెస్ సీనియర్, జూనియర్ పోటీలు, 15న వ్యాసరచన పోటీలు చంద్రయాన్-3, సీనియర్స్‌కు ఆదిత్య ఎల్-1, 16న చిత్రలేఖనం పోటీలు జూనియర్స్‌కు నెమలి బొమ్మ గీయుట, 17న ముగ్గుల పోటీలు, 18న వకృత్వ పోటీలు గ్రంథాలయం ఉపయోగాలు, గ్రీన్‌ఎనర్జీ, 19న క్విజ్ పోటీలు, 20న బేబీ షో పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

జగన్‌తోనే బంగారు భవిష్యత్

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బంగారు భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కొత్తపట్నం తూర్పు గ్రామంలో రాత్రి పల్లెనిద్ర చేసిన ఆయన శనివారం ఉదయం వేకువ జామునే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ పేదవారిని గుర్తించి చేయూతనివ్వాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. కుటుంబంలో మేలు చేసి భరోసాగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. అర్హులైన వారి అందరికీ సంక్షేమ పథకాలను దళారీ వ్యవస్థ లేకుండా అమలు పరుస్తున్నామన్నారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న వారిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాబ్జి, వైస్ ఎంపీపీ కైల సుబ్బారావు, ఎంపీటీసీ తణుకుల వెంకన్న, రమేష్, కొల్లాబత్తుల రవి, నారాయణ, రాజు, కవురు పెద్దిరాజు, బొక్కా ఆంజనేయులు, నేతల నాని, బాలం దాసు, తన్నీడి గిరి, బొక్కా నగేష్, గోడపాటి జయరాజు, బొక్కా వెంకటేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ, కవురు కొండయ్య, బాలం సంపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపురం సౌత్‌లో


సీతారాంపురం సౌత్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

నరసాపురం రూరల్: సీఎం జగన్ పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చి సంక్షేమం, అభివృద్ధిని ప్రజల ముంగిటకు తీసుకువచ్చారని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. సీతారాంపురం సౌత్ గ్రామంలో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పిల్లిపేట, నేతలపేట ప్రాంతాల్లో సర్పంచ్ దొండపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాలను గురించి వివరించారు. ప్రతి కుటుంబంలో మేలు చేసి భరోసాగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న తీరును గడప గడపకూ వివరించారు. దేశంలో ఎక్కాడా లేని విధంగా సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న వారి కళ్లు తెరిపించాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దొంగ మోహనరావు, అడబాల అయ్యప్పనాయుడు, వాస్కూరి నరసింహస్వామి, జెవిఆర్, మాదాసు గోపాలకృష్ణ, వంగలపూడి యేషయ్య, పులపర్తి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వలందర్‌రేవు మరమ్మతుల పరిశీలన


వలందర్‌రేవు మరమ్మతులు పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం: కార్తీకమాసం నేపథ్యంలో పట్టణంలోని గోదావరి వలందర్‌రేవు వద్దకు స్నానాలు చేయడానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. శనివారం ఆయన వలందర్‌రేవు వద్ద జరుగుతున్న పనులను పట్టణ సీఐ శ్రీనివాసాయాదవ్‌తో కలిసి పరిశీలించారు. వలందర్‌రేవు వద్ద స్నానఘటాట్టన్ని మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఆ ప్రదేశంలో మహిళలు బట్టలు మార్చుకునే గదులు, టాయిలెట్స్‌ను కూడా శుభ్రం చేస్తున్నామన్నారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మోటార్ల ద్వారా జల్లు స్నానం చేసే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సీఐ శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ రేవు వద్ద భద్రతా చర్యలు చేపడతామని చెప్పారు. రద్దీ ఎక్కువగా ఉండే సోమవారాల్లో అదనపు సిబ్బందిని బందోబస్తుకు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అభివృద్ధిపై దుష్ప్రచారం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపాలెం పంచాయతీ పాలకవర్గం, నాయకులు

నరసాపురం రూరల్: కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న పంచాయతీ పాలకవర్గంపై విమర్శలు చేయడం మానుకోవాలని మొగల్తూరు మండలం కొత్తపాలెం పంచాయతీ పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. సచివాయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉప సర్పంచ్ ఆకన రామకోటేశ్వరరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకుడు లోకం వెంకటేశ్వరరావు తదితరులు విలేకర్లతో మాట్లాడారు. గ్రామంలోని మురుగు, వర్షపు నీటిని మళ్లించేందుకు కచ్చాడ్రైన్ నిర్మాణం, రహదారికి ప్రయాణానికి ఆటంకంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించే పనులను రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచాయతీ నిబంధనలు పాటించి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ముందుకు సాగుతున్నామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తాము చేస్తున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలుగజేస్తున్నారన్నారు. మాజీ సర్పంచ్ ఒకరు గ్రామస్తులను రెచ్చగొడుతున్నారన్నారు. తమపై ఆరోపణలు చేస్తున్న నిప్పులేటి కరుణ్‌కుమార్, సురేష్‌బాబులు కొనుగోలు చేసిన 8 సెంట్ల గ్రామ కంఠం స్థలం ఆర్ఎస్ నెంబర్ 177లో లేదని రెవెన్యూ అధికారులు సూచించారన్నారు. తాము సర్వే చేయించిన అనంతరమే రెవిన్యూ అధికారుల సూచనలతోనే ఆర్ఎస్ నెంబర్ 178లో మాత్రమే డ్రెయిన్ నిర్మాణం చేపట్టామన్నారు. డ్రెయిన్ నిర్మాణం విషయంలో ఉన్నత న్యాయస్థానాన్ని తమపై ఫిర్యాదుదారులు ఆశ్రయించారని, దానికి డిపార్టుమెంట్‌పరంగానే కాకుండా, వ్యక్తిగతంగా కూడా కోర్టును ఆశ్రయించామని లోకం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారమే తాము నడుచుకుంటున్నామని విలేకరులకు వివరించారు. కోర్టు ఉత్తర్వులను కూడా విలేకర్లకు అందజేశారు. గ్రామాభివృద్దే ఎజెండాగా అంతాకలిసి ముందుకు వెళుతున్న పాలకవర్గం, అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాము కక్షపూరితంగా వ్యవహరించి ఇబ్బంది పెడుతున్నామని అనడాన్ని పాలకవర్గ సభ్యులంతా తప్పుబట్టారు. తమపై ఇలాంటి చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. ఈ సమావేశంలో కొత్తపాలెం పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కొత్తపల్లి నాగరాజు, గరగ బాలాజీ, గంగిమోలు లక్ష్మీదేవి, విల్లూరి మరియమమ, కొట్టు యాదగిరి, గాది సూరిబాబు, నిప్పులేటి సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిలో వరిసాగు మేలు


వ్యవసాయ సలహా మండల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి

యలమంచిలి: దాళ్వా పంటకు సాగునీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కొనేందుకు రైతులంతా వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేయాలని వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన వ్యవసాయ సలహా మండలి మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం వల్ల పంట 10 రోజుల ముందే కోతకు వస్తుందన్నారు. నాట్లు వేయాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ విధంగా ఎకరాకు రూ.6 వేలు ఖర్చు తగ్గుందన్నారు. అందువల్ల రైతులంతా వెదజల్లే పద్ధతిలో సాగు చేసేలా వ్యవసాయ సలహా మండలి సభ్యులంతా వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి కృషి చేయాలని కర్ణారెడ్డి కోరారు. మండల వ్యవసాయ అధికారి చిండులూరి దేవి మాట్లాడుతూ ఈ దాళ్వాకు పీఆర్-126 రకం విత్తనాన్ని రైతులు సాగు చేయవద్దని కోరారు. ఈ రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనదని, రైతులు సాగు చేసి ఇబ్బందులకు గురికావద్దని ఆమె కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాతా సునీల్ కుమార్, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, డ్రయిన్స్ ఏఈ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి


పాలకొల్లు ప్రెస్ క్లబ్ లో ఆర్ఎంపీ వైద్యులను సత్కరిస్తున్న ప్రాంతీయ నాయీబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘ నాయకులు

పాలకొల్లు అర్బన్: ఆయుర్వేద వైద్య వృత్తికి మూల పురుషుడు ధన్వంతరీ భగవాన్ జయంతి వేడుకలు శనివారం ప్రెస్‌క్లబ్ భవనంలో నిర్వహించారు. పాలకొల్లు ప్రాంతీయ నాయీబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ర్యాలి విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యులుగా జీవనం సాగిస్తున్న తిల్లపూడి సుబ్బారావు (ఆచంట వేమవరం), యడవల్లి రాజగోపాల్, అంతర్వేది పద్మనాభకుమార్ (గుంపర్రు), పోడూరి రామకృష్ణ పరమహంస(వేడంగి), తామరాడ శ్రీనివాస్ (ఆగర్రు)లను సత్కరించి జ్ఞాపికలతో అభినందించారు. నాయీబ్రాహ్మణ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన టి.గోపిని సంఘ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు ఉప్పలపు పెద్దిరాజు, సంఘ కార్యదర్శి అన్నవరం, పసలపూడి శ్రీనివాసరావు, దిగమర్తి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

మానిపండు తెగులును అరికట్టాలి


రైతులకు సూచనలిస్తున్న నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి

యలమంచిలి: ప్రస్తుతం వరి పంటను మానిపండు తెగులు ఆశిస్తుందని నివారణకు రైతులంతా సమర్థంగా పని చేయాలని నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి కోరారు. బూరుగుపల్లి గ్రామంలో శనివారం జరిగిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఈనిక దశలో ఉన్న ఎంటీయూ-1318 వరి రకానికి మానిపండు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ తెగులు నివారణకు ప్రాపికొనజోల్ (టిల్ట్) ఒక గ్రాము మందును లీటరు నీటిలో లేదా కార్బండిజమ్ (బావిస్టన్) ఒక గ్రాము మందును లీటరు నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్లు పిచికారి చేయాలని ఆమె సూచించారు. ఒకసారి పిచికారీ చేసిన వారం తరువాత మరోసారి పిచికారీ చేయాలన్నారు. పొలంబడి స్పెషల్ టాపిక్‌లో భాగంగా ఇన్‌చార్జి ఉద్యానశాఖాధికారి ప్రియదర్శిని మాట్లాడుతూ కొబ్బరి రైతులకు యాజమాన్య పద్ధతులు వివరించారు. పదేళ్లలోపు వయస్సున్న కొబ్బరిచెట్లకు 50 గ్రాముల బొరాన్, పదేళ్లు దాటి వయస్సున్న కొబ్బరి చెట్లకు 100 గ్రాముల బొరాన్ మందు వాడాలని చెప్పారు. ఈ విధంగా చేయడం వల్ల పూత, పిందె రాలకుండా కాయ మంచి నాణ్యంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి, రైతులు బోనం బులి వెంకన్న, పెంటపాటి సూకరాజు, జిడ్డు బదరీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి


మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రసూల్ సేవా సమితి సభ్యులు

పాలకొల్లు అర్బన్: భారత దేశానికి 11 సంవత్సరాలు పాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేసి అనేక విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహనీయుడు మౌలాన అబుల్ కలాం ఆజాద్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. రసూల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 134 జయంతిని నిర్వహించారు. ముందుగా అజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖరగ్‌పూర్‌లో సాంకేతిక విద్యాసంస్థను ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని రసూల్ సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నయాబ్ రసూల్ గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మస్తాన్‌వలీఖాన్, మహబూబ్ బాషా, ఖాజా, రహమాన్, అట్టాడ సీతారాం, సాహినా, షేక్ హజరత్ వలీ పాల్గొన్నారు.

కంప్యూటర్, డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాల శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్, డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ నిమ్మల అనంతరామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో నిర్వహించే ఈ శిక్షణలో కంప్యూటర్ శిక్షణకు ఇంటర్ ఉత్తీర్ణులైన 18 సంవత్సరాలు నిండినవారు అర్హులన్నారు. అలాగే డ్రైవింగ్‌లో శిక్షణ పొందడానికి పదో తరగతి ఉత్తీర్ణులై, 20 సంవత్సరాలు పైబడిన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 74160 99599కు ఫోన్ చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

పెనుగొండ: సిద్ధాంతం శివారున శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధాంతంకు చెందిన దంపతులు సప్పిడి సత్యనారాయణ, నాగమణి గాయపడ్డారు. వీరు రావులపాలెం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయే సరికి ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన దంపతులను 108 వాహనంలో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాణసంచా దుకాణాల వద్ద నిబంధనలు తప్పనిసరి



కాళ్ల లో బాణసంచా దుకాణాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కాళ్ల: బాణసంచా దుకాణాల వద్ద తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావు తెలిపారు. కాళ్ల మండలంలో శనివారం అగ్నిమాపక అధికారులు పర్యటించారు. బాణసంచా దుకాణాలు నిబంధనల అమలును పరిశీలించారు. దీపావళి బాణసంచా దుకాణాల వద్ద, విక్రయదారులు కొనుగోలుదారులు తగుజాగ్రత్తలు వహించాలని తెలిపారు. కాళ్లలో దీపావళి బాణసంచా దుకాణాల వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. దుకాణాల వద్ద ప్రమాద ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయించామన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది వి.వెంకటేష్, ఎం.శివకుమార్ పాల్గొన్నారు.

అందుబాటులో దీపావళి బాణసంచా

ఆకివీడు: ప్రజలకు అందుబాటులో దీపావళి బాణసంచా దుకాణాలను ఏర్పాటుచేశారు. స్థానిక సీఎం హైస్కూల్ ప్రాంగణంలో సుమారు 17 రిటైల్ షాపులకు తాత్కాలిక లైసెన్సుల అనుమతులతో ఏర్పాటు చేశారు. షాపుల వద్ద భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆర్డీఓ, సీఐ, ఎస్సై దుకాణ ప్రాంతాల్ని పరిశీలించారు. స్థానిక పోలీసుల భద్రతా ఏర్పాట్లు మధ్య అమ్మకాలు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ఆయా దుకాణాల వద్ద బాణసంచా కొనుగోలు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక సేవలో తరించాలి


సదస్సులో పాల్గొన్న చర్చిల ప్రతినిధులు, పాస్టర్ నెహ్రూ, సిస్టర్ రాజమణి

ఉండి: మహిళలు క్రీస్తు బోధనలు అనుసరించి ఆధ్యాత్మిక సేవలో తరించాలని జక్కరం పేరిష్ స్త్రీల చైర్మన్ సిస్టర్ జి.పంచరత్నం అన్నారు. శనివారం ఉండి మండలం కోలమూరు క్రీస్తు లూథరన్ ఆలయంలో ఉండి ఎన్నార్పీ అగ్రహారం పేరిష్ స్త్రీల చైర్మన్ సిస్టర్ వి.రాజమణి ఆధ్వర్యంలో స్త్రీల ర్యాలీ (సదస్సు) నిర్వహించారు. క్రైస్తవ కీర్తనలు, ఆరాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పంచరత్నం మాట్లాడుతూ ప్రతి స్త్రీ మంచి ఆలోచనలు, చక్కని ప్రణాళికలతో జీవించాలని సూచించారు. దేవుడు అప్పగించిన కుటుంబాన్ని సమాజానికి ఆదర్శంగా నిలపాలని, పిల్లల్ని పెంచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో కోలమూరు, ఉప్పులూరు, మహదేవపట్నం సంఘాల స్త్రీలు ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. గ్రూపు సాంగ్ పోటీలో ఎన్నార్పీ అగ్రహారం, కోలమూరు, వాండ్రం, బైబిల్ రిఫరెన్స్ పోటీల్లో ఉప్పులూరు, పాములపర్రు, ఎన్నార్పీ అగ్రహారం, బైబిల్ క్విజ్‌లో కోలమూరు, శేరేగూడెం, ఎన్నార్పీ అగ్రహారం సంఘాల స్త్రీలు నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. స్త్రీ పేరిష్ పాస్టర్ రెవరెండ్ వి.నెహ్రూ ప్రభువు ఆశీర్వాదాలను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ పాస్టర్ మార్కురాజు, పేరిష్ డెలిగేట్ మెంజిమెన్, ఆల్టర్‌నేట్ డెలిగేట్ మంగం రవికుమార్, మాజీ డెలిగేట్స్ పాము రవికుమార్, యాడంగి యేసు, గోడి ఫిలిఫ్, పోటీల జడ్జి ఎం రాబిన్‌సన్, వివిధ సంఘాల సీఆర్‌లు, స్త్రీల సమాజ ప్రతినిధులు, కోలమూరు, ఎన్నార్పీ అగ్రహారం, మహదేవపట్నం, చిలుకూరు, వాండ్రం, వెలివర్రు, వాండ్రంలంక, శేరేగూడెం, ఉప్పులూరు, పాములపర్రు సంఘాల స్త్రీలు పాల్గొన్నారు.